విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

ఈవీఎం గోదాము తనిఖీ చేసిన కలెక్టర్ బాలాజీ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంల గోదామును బుధవారం జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ తనిఖీ చేశారు. ఈవీఎంలు భద్రపరచిన గోదా ము వద్ద ఏర్పాటుచేసిన సెక్యూరిటీ, గోదాముకు వేయబడిన తాళాలు, వాలి సీళ్లు కలెక్టర్ పరిశీలించారు. గోదాముల వద్ద సీసీ కెమెరాలు పనిచేస్తున్నదీ లేనిదీ ఆరా తీసారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నెల వారీ తనిఖీల్లో భాగంగా ఈ తనిఖీ నిర్వహించారు. ఈ కారక్రమంలో కలెక్టరేట్ సమన్వయ విభాగం డిటి శ్యామ్ పాల్గొన్నారు.

యూనివర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్

విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్ : కృష్ణాయూనివర్సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి మందగల సాయికుమార్ అన్నారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో కృష్ణ యూనివర్సిటీ వి సీకి వినతి పత్రం అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, కృష్ణా యూనివర్సిటీలో విద్యార్థులు గతంలో పోలిస్తే ఈ విద్యా సంవత్సరం తగ్గిపోవడానికి ముఖ్య కారణం ట్రాన్స్పోర్టేషన్ సౌకర్యం లేకపోవడం, అదేవిధంగా విద్యార్థులకు విశ్వవిద్యాలయంలో కూర్చోవడానికి సరైన గదులు లేకపోవడం, మరియు ల్యాబ్లో ఎక్స్పెరిమెంట్స్ చేయడానికి కావలసిన పరికరాలు లేకపోవడం అని, 2000 మంది విద్యార్థులకు కేవలం నాలుగు బస్సులు మాత్రమే ఏర్పాటు చేయడం జరిగిందని, కావున వెంటనే ఉన్నత విద్యాధికారులు స్పందించి ఈ యూనివర్సిటీ అభివృద్ధికై తోడ్పడాలని విద్యార్థుల తరపున అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ కృష్ణాజిల్లా సమితిగా విన్నవించుకుంటున్నామని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం శ్రీకారం చుడ తాము అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కృష్ణా జిల్లా కన్వీనర్ సాదిక్ మరియు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటివద్దకే పింఛన్లు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : జిల్లాలో మొత్తం 2,40,939 మంది లబ్ధిదారులు ఉన్నారని, వారికి రూ.102.16 కోట్లు పంపిణి చేయాల్సిఉందని, జిల్లాలో ఆగస్టు నెలకు ఫించన్ల పంపిణీ ఉదయం 5గంటలకే ప్రారంభించి 10 గంటలలోపు 90 శాతం పంపిణీ పూర్తి చేసేలా సచివాలయ ఉద్యోగులు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుని లబ్దిదారుల ఇళ్ళవద్దే పింఛన్లు అందజేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ నుండి ఎంపిడిఓలు,మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డీకె. బాలాజీ మాట్లాడుతూ డిస్బర్స్మెంట్ అధికారులు బుధవారం బ్యాంకుల నుండి నగదు డ్రా చేసి క్షేత్రస్థాయి సిబ్బందికి పంపిణీ చేయాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేసి, ఇన్చార్జ్ సిబ్బందిని నియమించి, ఉదయం 3 గంటలకే విధులకు వచ్చి వేకప్ కాల్స్ చేసి పింఛన్ల పంపిణీలో ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా పర్యవేక్షించాలన్నారు. గత నెలలో కొన్ని మండలాల్లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని, పింఛన్ల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీలో ఉత్తమ ప్రగతి సాధించిన మొదటి 10 సచివాలయ సిబ్బందికి, మొదటి ముగ్గురు కమిషనర్లకు ప్రశంస లేఖలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఎస్వి. నాగేశ్వర నాయక్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ, ఆర్డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష

గృహ నిర్మాణం సంబంధించి లే అవుట్లలో, టిడ్కో సముదాయాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. లే అవుట్లలో మెరక, అంతర్గత రహదారులు, విద్యుత్,తాగునీటి సౌకర్యం పనులు, రిజిస్ట్రేషన్ అయిన గృహాలకు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలని కలెక్టర్ డి.కె.బాలాజీ అన్నారు. బుధవారం జిల్లాకలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఉపాధి హామీ, గృహ నిర్మాణం, టిడ్కో విద్యుత్, పిఆర్, ఆర్డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ బాలాజీ సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది జిల్లాలో 2.11 లక్షల జాబ్ కార్డులు జారీ చేయడం జరిగిందని, 59.11 లక్షల పని దినాలు కల్పించి రూ.154.13 కోట్లు కూలీల వేతనం చెల్లించినట్లు, కూలీల సరాసరి వేతనం రూ.260.78 చెల్లించినట్లు తెలిపారు. ఉపాధిహామీ కింద సీజన్లో, ఆఫ్ సీజన్లో చేపట్టే పనులపై ఆరా తీసి పనులు పరిశీలిస్తామన్నారు. రైతుల పొలాల్లో ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసినపుడు వాటి గట్లపై కూరగాయల పెంపకం సాగు ప్రోత్సహించి రైతుల ఆదాయం పెంచాలన్నారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల అభివృద్ధి చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పిడి, హౌసింగ్ పిడి ఇంచార్జ్ జీవి. సూర్యనారాయణ, టిడ్కో పిడి బి. చిన్నోడు, ఏపీ సిపిడిసిఎల్ ఎస్ఇ. మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా 'మంగినపూడి'

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : మంగినపూడి బీచ్ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఈ నేపద్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు బీచ్ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు మంత్రి రవీంద్ర తెలిపారు. బుధవారం ఉదయం అధికారులతో కలిసి మంగినపూడి బీచ్ను సందర్శిం చారు. అనంతరం రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ నాటి టీడీపి ప్రభుత్వ పాలనలో మంగినపూడి బీచ్ కు ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారులు, పరిసరాలను మెరక చేయడం వంటి అభివృద్ధి పనులు చేశామని, తర్వాత వచ్చిన ప్రభుత్వం బీచ్ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. బీచ్ లో ప్రైవేట్ భాగస్వామ్యంతో రిసార్ట్స్, ఇతర కార్యకలాపాల నిర్వహణకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమన్నారు. విద్యుత్ దీపాలు, సెక్యూరిటీ, ఏర్పాటు చేసి బీచ్ సందర్శన సమయాలను పొడిగిస్తామని, సందర్శకులకు ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా ఫ్లోటింగ్ రోప్స్, రక్షణ సిబ్బందిని ఏర్పాటు చేస్తామని, సందర్శకులకు భద్రత కల్పిస్తామన్నారు. మాస్టర్ ప్లాన్ రూపొందించిన అనంతరం అవసరమైన నిదులను సమకూర్చుకున్న వెంటనే మూడు నుంచి ఆరు నెలల్లో పూర్తిగా ప్రజలకు వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చీఫ్ ఆర్కిటెక్చర్ కిరణ్, పర్యాటక శాఖజిల్లా అధికారి జి, రామ లక్ష్మణ రావు, ఇంచార్జ్ తహసీల్దార్ సౌజన్య, వీఆర్వో గణేష్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల కట్టడికి కృషి చేయాలి : ఎస్పీ

విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్ : మహిళలు చిన్నారులపై జరుగుతున్న నేరాలు కట్టడికి ప్రతి ఒక్క పోలీస్ అధికారి కృషి చేయాలని ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు హెచ్చరించారు. బుధవారం పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయనమాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక కార్యచరణతో ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకుంటూ ప్రతి ఒక్క పోలీస్ అధికారి సమన్వయంతో పనిచేసి జిల్లాలో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పేలా కృషి చేయాలని అన్నారు. అపరిష్కృతంగా ఉన్న కేసులలో సమగ్ర దర్యాప్తు జరిపి మహిళా సంబంధిత నేరాల్లో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట సమయంలో బాధితులకు న్యాయం అందించాలని, రాష్ట్ర ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అయిన మహిళలు మరియు బాలికల మిస్సింగ్ కేసులను త్వరితగతిన వెతికి పట్టుకోవాలని, నిర్వహిస్తూ గంజాయి పై ఉక్కు పాదం మోపే దిశగా కృషి చేసి కృష్ణాజిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు, యువత, మాదగద్రవ్యాలు, గంజాయి బారిన పడకుండా కాపాడి వారికి బంగారు భవిష్యత్తు అందజేయాలన్నారు. రహదారి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్న ప్రదేశాలను బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, బ్యారికేడ్స్, రేడియం స్టిక్కర్ తో కూడా డ్రమ్ములు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. కేసు దర్యాప్తును కిందిస్థాయి సిబ్బందికి విడిచి ఎస్ హెచ్ ఓ లు నిర్లక్ష్యంగావ్యవహరిస్తే,శాఖాపరంగా చర్యలుతీసుకుంటామనిహెచ్చరించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి వెంకటేశ్వరరావు, ఎడిషనల్ ఎస్పీ ఏ ఆర్ డివిడి ప్రసాద్, డిఎస్పీలు అబ్దుల్ సుభాన్, మురళీధర్, జై సూర్య, శ్రీకాంత్, సుభాష్, నాగరాజు, రమేష్, ఇన్స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించటం సామాజిక బాధ్యతగా అలవరచుకోవాలని స్వచ్ఛ చల్లపల్లి రథసారధులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతిలు కోరారు. బుధవారం 3190వ రోజు స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమంలో భాగంగా హైవేకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. స్వచ్ఛ కార్యకర్తలు హైవేకి ఇరువైపులా మొక్కలు నాటగా, ట్రస్ట్ ఉద్యోగులు వాటికి రక్షణగా కంపకట్టారు. వర్షాకాలంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని వైద్య దంపతులు కోరారు.

దోమల నిర్మూలనకు చర్యలు

విశాలాంధ్ర-కూచిపూడి : గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేస్తుండటంతో గ్రామాలలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతోదోమలనిర్మూలన మందు ఎబిట్.ను స్ప్రే చేయించడంతోపాటు సున్నం బ్లీచింగ్ చల్లించే కార్యక్రమంలో నిమగ్నమైనారు. దీనిలో భాగంగానే కూచిపూడి సచివాలయ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆరోగ్య కార్యకర్త కత్తికరామాంజనేయులు, ఏఎన్ఎం. దగానివసుంధర పర్యవేక్షణలో డ్రైనేజీలలో, మురుగు గుంటలలో, నీరు నిలవ ఉన్న ప్రాంతాలలో దోమలు వ్యాప్తి చెందకుండా దోమల నిర్మూలన మందును స్ప్రే చేయించారు. అలాగే పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా బ్లీచింగ్.సున్నాన్ని చల్లించడంతోపాటుగ్రామాలలో రోడ్ల పక్కన కూడా బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమాలను కూచిపూడి పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి ఇస్లావత్ భవాని పర్యవేక్షించగా ఆశ వర్కర్స్ సహకరించారు

విశ్వవిద్యాలయంకు సారధి సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-కూచిపూడి : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠంకు సూపరింటెంట్ గా గత ఎనిమిది సంవత్సరాలుగాఆయన చేసిన సేవలు నిరుపమానమని వక్తలు కొనియాడారు. 36 సంవత్సరాలుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తోపాటు కూచిపూడి సిద్ధేంద్ర యోగి నాట్యకళాపీఠంలోవిధులు నిర్వహించిన సారథి బుధవారం పదవి విరమణ చేశారు. ఉన్నతాధికా రులకేకాకుండా కళా పీఠం సిబ్బంది కూడా చేసిన సేవలు పలువురికి స్ఫూర్తిదాయకమని అందరిని చిరునవ్వుతో ఆప్యాయతగా పలకరిస్తూ విధులు నిర్వహించడంలో ఆయనకు ఆయనే సాటిని పేర్కొన్నారు. అదనపు బాధ్యతలతో ప్రిన్సిపాల్ గా కొనసాగుతున్న అసోసియేట్ ప్రొఫెసర్. డాక్టర్ ఎం శ్రీనివాసరావు (శ్రీశైలం) వీడియో కాల్ ద్వారా సందేశం అందజేశారు.

పీహెచ్సీని ఆకస్మిక తనిఖీ చేసిన మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అవనిగడ్డ ఎం.ఎల్.ఎ మండలి బుద్ధప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. మండల పరిధిలోని వేకనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం మండలి బుద్ధప్రసాద్ ఆకస్మిక తనిఖీ నిర్వహించి, అక్కడ సిబ్బందితో మాట్లాడి పి.హెచ్.సి అవసరాలను తెలుసుకున్నారు. జూనియర్ అసిస్టెంట్ పోస్ట్ కాలీగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని మండలి వైద్య సిబ్బందికి సూచించారు. పాము కాటు మందుల స్టాక్, రెగ్యులర్ మందుల స్టాక్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పి.హెచ్.సిలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి చిన్నారులకు రెగ్యులర్ పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తుంగల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

విశాలాంధ్ర-చల్లపల్లి, : ప్రతి ఒక్కరూ రక్తదానం చేయటం ద్వారా ప్రాణదాతలు కావాలని లయన్స క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్పర్సన్(బ్లడ్ క్యాంప్స్) టి.సాంబశివరావు సూచించారు. స్థానిక శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాంబశివరావు మాట్లాడుతూ, రక్తదానం ఆవశ్యకత, ఏడాదిలో ఎన్నిసార్లు రక్తదానం చేయవచ్చు, ఏయే వయసుల వారు రక్తదానం చేయవచ్చు తదితర అంశాలపై యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.రమేష్ బాబు , చల్లపల్లి లయన్ క్లబ్ అధ్యక్షులు రాయపాటి రాధాకృష్ణ, ఇంగ్లీష్ అధ్యాపకులు కె.సురేష్ బాబు పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షిత మంచినీరు అందించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : ప్రజలకు సురక్షిత త్రాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎం.ఎల్.ఎ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని వేకనూరు రక్షిత మంచినీటి పథకం, ఓవర్ హెడ్ ట్యాంక్, ఫిల్టర్ బెడ్స్ ను మండలి బుధవారం పరిశీలించి మాట్లాడారు. 60 వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ఈ పథకం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మండలి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్.డబ్ల్యూ.ఎస్ డిఇఇ పాలచర్ల సత్యనారాయణ, ఎఇ భోగాది జగత్, ఉపసర్పంచ్ తుంగల మురళీకృష్ణ, గ్రామ ప్రముఖులు తుంగల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆషాడసారె పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : ఆషాడబహుళఏకాదశి బుధవారం మొవ్వ గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధులు పలు దేవాలయాల లోనిదేవేరులకు (అమ్మవార్లకు) ఆషాడసారె సమర్పించారు. వారు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా సారెను తీసుకుని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం, శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ భీమేశ్వర ఆలయం, రజకుల రామాలయం, గౌడ రామాలయం, అంకమ్మ అమ్మవారి మందిరం, రేణుకమ్మ మందిరం, తాతినేని వంశస్తుల గంగానమ్మ మందిరం, మండవ వంశస్తుల గంగానమ్మ మందిరం లలోని దేవేరులకుచీర,పసుపు, గాజులు, కుంకుమ, పూలు, పండ్లు లాంటి పూజా ద్రవ్యాలతో కూడినసారెను సమర్పించారు. అలాగే శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయాన్ని, శ్రీ షిరిడి సాయిబాబా మందిరంను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన కార్యక్రమంలో ఎందూరు జగన్మోహనరావు, పువ్వాడ సురేష్, బెజవాడ సాంబశివరావు, మాటూరువెంకటేశ్వరరావు, కంతేటిహేమ నవీన్, నందిపాటి రమేష్, నందిపాటి సత్యనారాయణ, నందిపాటి ఆంజనేయులు, పువ్వాడ రామకృష్ణ తదితరులు తో పాటు అధిక సంఖ్యలో మహిళలు, పలువురుదంపతులతో సహా పాల్గొని పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారంపై దృష్టి

విశాలాంధ్ర అవనిగడ్డ : అవనిగడ్డ గ్రామ ప్రధాన డ్రైనేజి సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టినట్లు శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. బుధవారం సీతయామ్మ హోటల్ వద్ద డ్రైనేజి మండలి అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. గ్రామ ప్రధాన డ్రైనేజి సమస్యపై దృష్టి సారించినట్లు బుధవారం మండలి తెలిపారు. ఆర్.డబ్ల్యూ.ఎస్ డిఇఇ పాలచర్ల సత్యనారాయణతో కలిసి అవనిగడ్డ డ్రైనేజి స్వరూప మ్యాప్ను మండలి పరిశీలించారు. కరకట్ట నుండి మండపం మీదుగా మురుగు కాలువ వరకు ఉన్న ప్రధాన డ్రైనేజిని సీతాయమ్మ హోటల్ వద్ద పరిశీలించారు. మురుగు ప్రవాహానికి అడ్డంకులు ఎదురవుతున్న ప్రదేశాలు మ్యాప్ ద్వారా సిబ్బంది వివరించారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు నియోజకవర్గానికి 20 కోట్లు కేటాయించిన నేపథ్యంలో డ్రైనేజిల అధివృద్ధికి 20 శాతం నిధులు కేటాయించినట్లు డిఇఇ సత్యనారాయణ వివరించారు. అవనిగడ్డ 7వ వార్డులోని కరకట్ట నుంచి సీతాయమ్మ హోటల్ , ఎ.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్ మీదుగా మురుగు కాలువ వరకు ఉన్న డ్రైనేజి, సీతాయలంక డ్రైనేజిలు అభివృద్ధి చేసేందుకు ఎం.ఎల్.ఎ సూచనల మేరకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్.పి.టి.సి కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎఇ భోగాది జగత్, పంచాయితీ ఇఓ తోట శ్రీనివాసరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి ప్రి స్కూల్ ను బుధవారం స్త్రీ శిశు సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్య కుమారి కేసరపల్లి లో ని స్నేహపురి కాలనీ అంగన్వాడీ కేంద్రం తనిఖీ చేసారు, లబ్దిదారులకు ఇచ్చే సరుకుల నాణ్యత పరిశీలించారు, యాప్ లో ఏ విధంగా ఎంటర్ చేస్తారు అనే విషయాలు పరిశీలించారు, ప్రి స్కూల్ సిలబస్ ప్రకారం జరుగుతుందా, లేదా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పిడి యు సువర్ణ,సిడిపి ఓ పి వెంకటలక్ష్మి, సూపరవైజర్ సిహెచ్ నాగ పద్మావతి,టీచర్ యు స్వప్న పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి 167 మంది నియామకం

విశాలాంధ్ర-కూచిపూడి : ఆగస్టు 1(గురువారం) న నిర్వహించే ఎన్టీఆర్ భరోసాపెన్షన్ పంపిణీకి మొవ్వ మండలంలోని 16 సచివాలయాలకు 167 మంది సిబ్బందిని కేటాయించినట్లు ఎండిఓ జి చంద్రశేఖర్ వెల్లడించారు. ఈసిబ్బంది వేకుజామున నాలుగు గంటల నుంచి లబ్ధిదారుల తలుపు తట్టి పెన్షన్ అందజేయడానికి సిద్ధమవుతున్నారని, వీరితోపాటు ఎన్డీఏ కూటమి లోని నేతలు కూడా పాల్గొంటారని వివరించారు. అలాగే పెన్షన్లుఅధికంగా గలసచివాలయాలలో పంచాయతీ, సచివాలయ సిబ్బందితోపాటు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, హై స్కూల్స్ బోధనేతర సిబ్బందిని కూడా కేటాయించమన్నారు. సచివాలయాల వారీగా అవురుపూడి, మొవ్వ-2లలో 8 మంది చొప్పున, అయ్యంకి, భట్లపెనుమర్రు, పెదసనగల్లులో పదిమంది చొప్పున, చినముత్తేవి, మంత్రి పాలెంలలో ఏడుగురు చొప్పున, వేములమడ, మొవ్వ-1లలో 9మంది చొప్పున, కాజ-1లో 14మంది, కోసూరులో 17 మంది, కూచిపూడి, పెదముత్తేవి, పెదపూడి లలో 12 మంది, నిడుమోలు, కాజ -2లో 11 మంది ప్రభుత్వ సిబ్బంది పంపిణీ చేయనున్నారని వివరించారు.

ఏడుకొండలు కుటుంబానికి మండలి పరామర్శ

విశాలాంధ్ర-అవనిగడ్డ : అవనిగడ్డ మండల పరిధిలోని వేకనూరు జనసేన పార్టీ నాయకులు మాదివాడ ఏడుకొండలు (చింతాల్ ఏడుకొండలు) ఇటీవల మృతి చెందారు. బుధవారం వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరామర్శించి మాట్లాడారు. ఏడుకొండలు మృతికి తమ ప్రగాఢ సంతాపం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వారికి అండగా ఉంటామని మాదివాడ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గుడివాక శివరావు, పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

విశాలాంధ్ర-పెడన: పెడన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్ పర్సన్ కటకం నాగ కుమారి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ఎజెండాలోని 23 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించగా వాటిలో రెండు అంశాలపై 12వ వార్డు జనసేన పార్టీ కౌన్సిలర్ మట్ట శివ పావని డీసెంట్ ఇచ్చారు. సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా శానిటేషన్ పనులకు మున్సిపల్ నిధులు కేటాయించారు. ఈ కేటాయింపులు అజెండాలోని 11, 12 అంశాలుగా చేర్చారు. ఈ కేటాయింపుల పట్ల శివ పావని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేటాయింపులతో మున్సిపాలిటీకి ఏమాత్రం సంబంధం లేదని అన్నారు. నిధులు కేటాయింపు బాధ్యత ఆర్ ఓ దే నని అన్నారు. ఆర్వో నుండి నిధులు వచ్చాకే శానిటేషన్ పనులకు కేటాయింపులు జరగాలని ఆమె సూచించారు. అత్యవసరమైనందున ఆర్ ఓ ఆదేశాల మేరకు శానిటేషన్ పనులకు మున్సిపల్ నిధులు కేటాయించడం జరిగిందని కమిషనర్ వెంకట్రామయ్య పేర్కొన్నారు. కేటాయించిన నిధులు తిరిగి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఆర్వో నుండి నిధులు యిచ్చాకే శానిటేషన్ పనులకు నిధులు కేటాయించాలని ఈ అంశంపై తాను డీసెంట్ ఇస్తున్నానని శివ పావని ప్రకటించారు. ఈ అంశంపై 8 వ వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడు భోగా మీరెవరు మాట్లాడటానికి అని శివ పావని ప్రశ్నించటంతో వారిరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుందివాగ్వివాదం అనంతరం శివపావని మాట్లాడుతూ మున్సిపాలిటీ ఖర్చు చేసిన నిధులను తిరిగి ఇచ్చేస్తామని ఆర్వో మీకు లెటర్ ఇచ్చారా అనే కమిషనర్ను ప్రశ్నించగా మీరు అడిగితే చెప్పాల్సిన అవసరం తనకు లేదని చైర్పర్సన్ అడిగితేనే తన సమాధానం చెబుతానని కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. చైర్ పర్సన్ మాట్లాడటం లేదు గనకే మిమ్మల్ని అడుగుతున్నానని శివ పావని ఘాటుగా స్పందించారు. డ్రైన్ లలో. సిల్ట్ తొలగింపుకు 22 లక్షల రూపాయలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కు కటకం ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ బైగాని వెంకటరామయ్య, ఏఈ రామాంజనేయులు డిపిఓ యేసుబాబు, ఇంచార్జ్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ హరి కిషోర్,ఆర్ఐ పామర్తి వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ సుందరం, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

రిజర్వేషన్లకు పార్లమెంటులో చట్టం చేయాలి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లకు పార్లమెంటు లో చట్టం చేయాలని సోషలిస్టు జనతా కాంగ్రెస్ కూటమి జాతీయ చైర్మన్ జై బాబు డిమాండ్ చేశారు. బుధవారం గాంధీనగర్ ప్రెస్క్లబ్ లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు.అయితే కొన్ని రాష్ట్రాల్లో హైకోర్టులు నిలుపుదల చేశాయని, మరి కొన్ని రాష్ట్రాల్లో అమలు సరిగా జరగడం లేదని వాపోయారు. దీనిపై సుప్రీంకోర్టు ను ఆశ్రయిస్తే రాష్ట్రాలు చట్టం చేసే పరిది కాదని, పార్లమెంటే రాజ్యాంగ సవరణ చేయాలని తీర్పులు చెబుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ రంగం సంస్థలు అంతరించి పోతున్న తరుణంలో భావి తరాల కోసం ప్రైవేటు సంస్థలలో రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్యకు పార్లమెంట్ మాత్రమే పరిష్కారం చూపించాలన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు సంస్థల్లో రిజర్వేషన్లు చట్టబద్ధత కోసం సోషలిస్ట్ జనతా కాంగ్రెస్ కూటమి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సోషలిస్ట్ జనత కాంగ్రెస్ కూటమి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓర్సు వీరభాస్కర్, ఎం.సి.పి.ఐ(యు) రాష్ట్ర కార్యదర్శి మర్రెడ్డి వెంకటరెడ్డి, అమరావతి భూముల పరిరక్షణ చైర్మన్లు అనుమోలు గాంధీ,శిరిపురపు ఫ్రాన్సిస్, బొల్లిపోగు బజారు, యు.వై.ఎఫ్.ఐ రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్ తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కంకిపాడులో కత్తితోదాడి

విశాలాంధ్ర-కంకిపాడు : లంచం అడిగాడని ఏకంగా ఉద్యోగిపై కత్తితో.. దాడి చేసిన ఘటన బుధవారం కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగింది. ప్రైవేటుగా పనిచేస్తున్న దేవరకొండ శ్రీనివాసరావు లంచం డిమాండ్ చేయడంతో .. గంగూరుకు చెందిన.. రహెమాన్ భారతీయుడు సినిమా పక్కిలా బొడ్డు లొంచి కత్తి తీసి.. విచక్షణ రహితంగా ఛాతిపై పొడిచాడు. దీంతో రక్తస్రావం పడిన శ్రీనివాసరావు ను .. ఆసుపత్రి కి తరలించారు. గత రెండు సంవత్సరాలుగా.. సదరు ఉద్యోగి నకలు కోసం.. తిప్పుతున్నాడని, ప్రభుత్వ అధికారుల లంచగొండితనంపై.. నిందితుడు రహెమాన్ విచారం వ్యక్తం చేశాడు. సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. కంకిపాడు సబ్ రిజిస్టర్ కార్యాలయం అవినీతితో మునిగిపోయింది. పౌరసేవల పేరుతో ఇష్టం వచ్చినట్టు దండుకుంటున్నారు. సంఘటన స్థలాన్ని అదనపు ఎస్ఐ టి తాతాచార్యులు పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు రహెమాన్ పోలీసుల అదుపులో ఉన్నాడు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

సమర్ధవంతంగా మధ్యాహ్న భోజన పథకం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : మధ్యాహ్న భోజన పథకం సమర్ధవంతంగా అమలుకు కృషి చేస్తున్నట్లుత జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ.సృజన తెలిపారు. మైలవరం మండలంలోని చిలుకూరివారి గూడెంలోని అప్పిరెడ్డి సుబ్బారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు, మెనూను పరిశీలించారు. అనంతరం ఆహార నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు స్వయంగా కలెక్టర్ భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు టీచింగ్ ప్లాన్ ప్రకారం తరగతులు నిర్వహించటంతో పాటు భవిష్యత్తులో కెరీర్ పరంగా ఉన్నతంగా ఎదిగేందుకు అవసరమైన సహపాఠ్య కార్యక్రమాలపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. విద్యార్థులు ప్రతి రోజూ తరగతులకు హాజరయ్యేలా చూసి ప్రణాళికలకు అనుగుణంగా విద్యా నైపుణ్యాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. భవిష్యత్తు కెరీర్ పరంగా ఉన్న అవకాశాలు, వాటిని అందిపుచ్చుకునేందుకు అనుసరించాల్సిన మార్గాలపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులకు సూచించారు. వంటగది, గార్డెన్ అభివృద్ధితో పాటు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాలల్లో ఇంకా అవసరమైన మౌళిక వసతుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామితో రైతులకు ఊతం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఉపాధి హామికి ఊతంతో చిన్న సన్నకారు రైతులకు నూరు శాతం సబ్సిడి క్రింద ఉద్యాన పంటలను చేపట్టి ఆర్థిక పరిపుష్టి కల్పించి జిల్లాలో 1760 ఎకరాల్లో పండ్లు, పూలతోటల పెంపకాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా.జీ.సృజన తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం ద్వారా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మైలవరం మండలం కొత్త మంగాపురంలో చేపట్టిన మల్లెతోటలను బుధవారం కలెక్టర్ సందర్శించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా కొత్త మంగాపురం మల్లెతోట రైతు కుప్పాళ్ల ముత్తయ్య నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాను జాతీయ ఉపాధి హామి పథకం ద్వారా ఒకటిన్నర ఎకరాల్లో మల్లెతోట సాగును ప్రారంభించినట్లు తెలిపారు. మొక్కలు నాటడానికి గుంతలు తీయటంతో పాటు మూడేళ్ల పాటు మొక్కల పెంపకం నిర్వహణకు, అంతర పంటలు చేపట్టేందుకు అయ్యే పనులను జాతీయ ఉపాధి హామి పని దినాల్లో కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామి పథకం పీడీ జే.సునీత, డీపీవో ఎస్వీ.శివప్రసాద్ యదవ్, ఏపీడీ వెంకటేశ్వరరావు, ప్లాంటేషన్ మేనేజర్ ఉషారాణి, ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్ వంశీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామి పనులతో భూగర్భ జలాల పెంపు

జాతీయ ఉపాధి హామి పథకం కింద పని కోరిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పిస్తున్నామని జిల్లాలో ఉద్యాన రైతుల సౌకర్యార్ధం ఉద్యాన తోటల్లో 288 పంట కుంటలు నిర్మాణం చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా.జీ.సృజన తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం ద్వారా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మైలవరం మండలం పుల్లూరు గ్రామ సమీపంలో ఉల్లిబోయిన సోమయ్యకు చెందిన మామిడి తోటలో నిర్మిస్తున్న పంట కుంటను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామి పథకం ద్వారా పని కోరిన ప్రతి ఒక్కరికి పని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామి పథకం పీడీ సునీత, డీపీవో శివప్రసాద్‌యాదవ్, ఏపీడీవో శ్రీనివాసరావు, ఏపీవో వెంకటేశ్వరరావు, ప్లాంటేషన్ మేనేజర్ ఉషారాణి, డిప్యూటీ తహాశీల్దార్ శ్రీహరి పాల్గొన్నారు.

యువత ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలి

యువత ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఎదగాలని చిన్నచిన్న ఇబ్బందులను అధిగమించి పట్టుదలతో పని చేస్తే ఉన్నత స్థానాన్ని సాదించవచ్చని జిల్లా కలెక్టర్ డా.జీ.సృజన పేర్కొన్నారు. చిరుద్యోగం నుంచి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగినవారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ

ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌కు చెందిన ఎస్‌కే సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కేఎల్ గ్రూప్ సహకారంతో ఆమెజాన్ సంస్థలో ఉద్యోగాల భర్తీకి బుధవారం గొల్లపూడిలోని గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో నిర్వహించిన జాబ్ మేళాను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత నివాస ప్రాంతంలోనే ఉద్యోగం పొందాలనే అపోహను విడనాడి అవకాశాలున్న చోటుకే వెళ్లి పని చేయగలమనే మనోదైర్యాన్ని పెంచుకోవాలన్నారు. కష్టాల నుంచి సుఖాన్ని పొందే అవకాశం ఉంటుందని, చిన్నచిన్న ఇబ్బందులను అదిగమించి పట్టుదలతో పనిచేస్తే ఉన్నత స్థాయికి ఎదగుతామన్నారు. జీవితంలో సాదించాలనే లక్ష్యాన్ని పెట్టుకుని చిరుద్యోగిగా ప్రస్తానాన్ని మొదలు పెట్టి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు యువత కృషి చేయాలని సూచించారు. ఈ జాబ్ మేళాకు 66 మంది హాజరుకాగా 52 మంది అర్హత సాదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమెజాన్ ప్రతినిది రమణ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా ఉపాది అధికారి విక్టర్‌బాబు, నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇబ్రహీంపట్నం క్వారీలో ధర్నా

- పరిశ్రమల్లో ప్రమాదాలు, కాలుష్యాన్ని నివారించాలి
- క్వారీ ప్రమాద బాధితుల కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్ గ్రేషియో ఇవ్వాలి : దోనేపూడి శంకర్

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): పరిశ్రమలు, క్వారీలలో భద్రతను పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ అధికారుల ఉదాసీనత కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, కాలుష్యంతో కారణంగా కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం దాసరి భవన్ వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల పరిశ్రమలలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అల్ట్రాటెక్ సిమెంట్, రాంకో సిమెంట్, ఎన్టీపీసీ, పరిటాల క్వారీ ప్రాంతాలలో జరిగిన ప్రమాదాల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన కార్మికులు అసువులు బాసారని ఆవేదన వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన తండాలకు చెందిన నిరుపేదలు పొట్టకూటి కోసం ప్రాణాలను పణంగా పెట్టి క్వారీలలో ఎండనకా..వాననకా దుమ్ము, ధూళిలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వీరి శ్రమను పెత్తందారులు దోచుకుంటున్నారని విమర్శించారు. పరిటాల వద్ద 300 ఎకరాలలో వున్న క్వారీలపై వేలాది మంది ఆధారపడి ఉన్న కార్మికులకు రక్షణ కోసం గ్లౌజులు, హెల్మెట్లు, బూట్లు, వంటి రక్షణ పరికరాలు, ఇన్సూరెన్స్ ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించకుండా ప్రమాదం అంచుల్లో పనిని చేయిస్తున్నారన్నారు. 99 క్వారీలకు ప్రభుత్వం అనుమతినివ్వగా, వాటికి అదనంగా అనధికారికంగా 50 క్వారీలు నడుస్తున్నాయని, అధికారుల మామూళ్ళ మత్తులో పరిశ్రమల పర్యవేక్షణను గాలికి వదిలివేసారని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మంత్రి నారా లోకేష్, ప్రతిపక్ష పార్టీ నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి భరోసా కల్పించాలని కోరారు. ప్రమాదాలకు కారణాలను పరిశీలించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ కాంపెన్సేషన్ యాక్ట్ ప్రకారం క్వారీలో చనిపోయిన కార్మికుడు రాందేవ్ బాగేల్ కుటుంబానికి కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశించిన రూ 16,89,150 ఇవ్వాలని, మృతులు బత్తుల దుర్గారాజు, వివి నాయక్, భాగేల్ కుటుంబాలకు రూ 50 లక్షలు చొప్పున ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 2వ తేదీన ప్రమాదాలు కాలుష్యంపై ఇబ్రహీంపట్నం సెంటర్ లో జరిగే ధర్నాకు ప్రజా సంఘాలు, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను దోనేపూడి శంకర్ ఆవిష్కరించిన అనంతరం ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుద్ది రమేష్, నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లంకా గోవిందరాజులు, బుద్ధవరపు వెంకట్రావు, పెయ్యల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇసుక పంపిణీలో వైఫల్యం : వేల్పుల

విశాలాంధ్ర-కంచికచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పంపిణీ విధానం ఆచరణ అమలులో పూర్తి వైఫల్యం చెందుతోందని కంచికచర్ల జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి, పలువురు వైసిపి నాయకులు ఆరోపించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమా వేశంలో ప్రశాంతి తదితరులు మాట్లాడు తూ దేశం పార్టీ నాయకులతో పాటు మీడియా ప్రతినిధులు సైతం మండలం లో యదేచ్ఛగా ఇసుక దోపిడీకి పాల్పడు తున్నారని ఆరోపిస్తూ, తగుఆధారాలను సైతం మీడియాకు ప్రదర్శించారు.పలు వురు మీడియా ప్రతినిధులు సైతం మండలంలోని కీసర ఇసుక స్టాక్ యార్డులో తిష్టవేసి, సొంత వాహనాలు సమకూర్చుకొని ఇసుక దందాను యదేచ్ఛగా కొనసాగిస్తున్నారన్నారు. లారీల్లో 20 టన్నుల వరకే లోడింగ్ పరిమితి ఉండగా 40 టన్నుల వరకు లోడ్ చేయించి,అదనపు సొమ్ము మీడియా ప్రతినిధులు వసూలు చేస్తు న్నారని ఆరోపించారు.విజయవాడ ఎంపీ అనుచరునిగా చెప్పుకుంటున్న ఆర్ఎస్పీ బాబు సైతం పలుమార్లు ఎటువంటి రుసుము చెల్లించకుండా ఆక్రమంగా ఇసుక అధిక లోడులతో తరలిస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. దేశం పార్టీకి చెందిన పలువురు మండల స్థాయి నాయకులు సైతం ఇసుక దందా లో పాల్గొంటున్నారన్నారు. ఈ విషయా లన్నీ మైనింగ్ రికార్డుల్లో సైతం నమోదు అయ్యాయని,అధికారులు ఎవరైనా పరిశీలించుకోవచ్చని సంబంధిత రికార్డు కాపీలను సైతం మీడియాకు అందజే శారు.పేదవాడికి ఇసుక ఉచితంగా అందాలని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకానికి నాయకులతోపాటు మీడియా ప్రతినిధులు సైతం తూట్లు పొడుస్తున్నా, అధికారులు ఎవరూ ఈ విషయాలు పట్టించుకోకపోవడంశోచనీయమన్నారు. కీసర ఇసుక స్టాక్ యార్డ్ నుంచి అక్రమం గా ఇసుక తరలిస్తున్న లారీలను ఇటీవల తెలంగాణ రాష్ట్రం పోలీసులు మధిర,ఎరుపాలెం లలో స్వాధీనపరచు కున్నా, ఇక్కడ అధికారులలో చలనం లేకపోవడం శోచనీయం అన్నారు. వైసిపి నాయకుడు వేల్పుల రమేష్ మాట్లాడుతూ ఇసుక యార్డ్ లో తాను ఎవరి మీద దౌర్జన్యాలకు పాల్పడలేదని, తన అన్న వెంకట్రావు పై అకారణంగా దౌర్జన్యం చేశారని,గొడవ జరుగుతుంటే తాను పెద్ద మనిషిగా వ్యవహరించానని తెలిపారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు రామారావు,కందుల అశోక్ లు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు
నిరంతర పర్యవేక్షణ అవసరం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు సురక్షితమైన త్రాగునీటినే సరఫరా చేసేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర ఆదేశించారు. స్థానిక డాక్టర్ కేఎల్ రావు హెడ్‌వాటర్ వర్క్స్‌ను కమిషనర్ బుధవరం పరిశీలించారు. అనంతరం విద్యధరపురంలోని ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, హెచ్‌బీ కాలనీ, గాంధీజీ మహిళా కళాశాల వద్ద జరుగుతున్న అన్న క్యాంటీన్ల పునఃనిర్మాణ పనులను పరిశీలించారు. తరువాత హనుమాన్‌పేటలోని వెహికల్ డిపోను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో వాడుతున్న ప్రతి వాహనం అందుబాటులో ఉంచాలన్నారు. మరమ్మతుల్లో ఉన్న వాహనాలను సత్వరమే అందుబాటులోకి తీసుకురావాలని, అవసరమైతే మరికొన్ని వాహనాలను పెంచి పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సంబందిత అధికారులకు ఆదేశించారు. ఈ పర్యటనలో నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పీ.రత్నావళి, ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈలు ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, ఇంజనీరింగ్ సిబ్బంది, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్‌డీఏతో ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర-కంచికచర్ల: మండల పరిధిలోని నిరుద్యోగ యువతి యువకులకు మంచి అవకాశం.చదువు కొని ఉద్యోగ అవకాశాలు కొరకు ఎదురు చూస్తున్న యువతి,యువకులకు డి ఆర్ డి ఎ నుండి ఉపాధి అవకాశాలు కలవు ఈ ప్రక్రియ డి ఆర్ డి ఎ, వెలుగు కార్యా లయంలో అప్లికేషన్ ఇస్తారని, కంచికచర్ల మండల వెలుగు కార్యాలయం ఎపియం భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు కొని ఉద్యోగ అవకాశాలు కొరకు ఎదురు చూస్తున్న యువతి యువకులకు డి ఆర్ డి ఎ ద్వారా మంచి అవకాశం వచ్చిందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు అవసరమైన ట్రైనింగ్ ఆన్ లైన్ అప్లికేషన్, పథకాలకు అవసరమైన డిపిఆర్ అన్ని కంచికచర్ల మండల వెలుగు కార్యాలయంలో ఆగస్టు నెలలో 03-08-24 నుండి 07-08-24 వరుకు జరుగును మీకు ఇంకా పూర్తి వివరాలు కావాలంటే కంచికచర్ల మండల వెలుగు కార్యాలయంలోని వెలుగు కార్యాలయం ఎపియం భాస్కరరావును కలవాలని తెలిపారు.ఈ విషయం మీకు తెలిసిన ప్రతి ఒక్కరికీ తెలపగలరని డి ఆర్ డి ఎ పిడి,మరియు,డిడి ఎస్ డెబ్యూ ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల వెలుగు కార్యాలయం వారు తెలిపారు.

రాష్ట్ర స్థాయి తైకాండో పోటీలకు కేవీ విద్యార్థులు

విశాలాంధ్ర-విజయవాడ: స్థానిక ఆంధ్రా లయోలా కళాశాలలో జూలై 28వ తేదిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు చక్కని ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనటు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ ఎంవీ రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులను పి.అక్షర అండర్-14, 45 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని, అండర్-14, 42 కిలోల విభాగంలో సీహెచ్. జాగ్రవి ఉమాదేవి రజిత పతకం సాధించారని చెప్పారు. కేంద్రీయ విద్యాలయం నెం.1లో ఏడవ తరగతి చదువుతున్న ఈ విద్యార్థులను ఆయన అభినందించారు. వారు భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీ డాక్టర్ టి.ఏడుకొండలు, తైక్వాండో కోచ్ ఎం.అంకమరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఆటంకం కలగకుండా డ్రైనేజీలు తీయాలి

విశాలాంధ్ర-తిరువూరు: ప్రజలకు ఆటంకం లేకుండా డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలని, వ్యాపారులకు, చిరు వ్యాపారస్తులు, డ్రైనేజీ దగ్గరలో ఉన్న మెకానికులకు, ఏదైనా స్థలంలో ప్రత్యాన్మాయం దొరికేవరకు మున్సిపల్ డ్రెయిన్స్‌పై ఉన్న ఆక్రమణలు తొలగించటానికి ఒక నెల గడువు ఇవ్వాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఆయనకు సీపీఐ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. రోడ్లు డ్రైనేజీలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని ప్రజలకు,వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తకుండా నిదానంగా పనులు జరిగే విధంగా మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, సీపీఐ కార్యకర్తలు తదితర పాల్గొన్నారు.

ఏఎస్ఐ దుర్గారావు పదవీ విరమణ

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్లలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న దుర్గా రావు సేవలు అభినందనీయమని విజయవాడ కమిషనర్ ఎస్ వి రాజ శేఖర్ బాబు అన్నారు.బుధవారం ఆయన కార్యాలయంలో పదవీ విరమణ సందర్భంగా దుర్గారావును కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా సత్కరించారు.35 సంవత్సరాల సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి, కర్తవ్య నిర్వహణ లో చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేసి పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ చేస్తున్న దుర్గారావు మిగిలిన జీవితం ప్రశాంతంగా సాగాలని ఆయన అన్నారు.పోలీసుల విధి నిర్వహణ కత్తిమీద సాము వంటిదని అటువంటి ఉద్యోగ బాధ్యతను సక్రమంగా నిర్వ హించి ఎటువంటి తప్పిదాలు లేకుండా సుదీర్ఘ కాలంపాటు పోలీస్ శాఖలో పనిచేసి పై అధికారుల నుండి ఎన్నో అవార్డులు ప్రశంసలు పొందిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి ఏఎస్ఐగా పదవీవిరమణ చేయడం అభినంద నీయమని అన్నారు.

చిన్నం రామకృష్ణకు డాక్టరేట్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రముఖ న్యాయవాది, సైకాలజీస్ట్ ఫ్యామిలీ కౌన్సిలర్ చిన్నం రామ కృష్ణకు డాక్టరేట్ లభించింది. 25ఏళ్లుగా సేవా సంస్థలలో ఎంతో మందికి సేవలందిస్తున్న రామకృష్ణకు తమిళనాడుకు హెరీసూరుకు చెందిన ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్శిటీ వారు గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ఈనెల 27వతేదీన హెరీసూర్ లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగాగా డాక్టరేట్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయ అకాడమీ ఫౌండర్ బి.బాబు విజయన్, నిలయం అధ్యక్షుడు డాక్టర్ చేరాల ప్రకాష్, డాక్టర్ ఎస్.రవి చంద్రన్, స్వామీజీ పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: విద్యార్థులు చక్కగా చదువుతున్న తల్లిదండ్రులకు, గురువులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చి ఉత్తమ సమాజ నిర్మాణంలో భాగ స్వాములు కావాలని డెప్యూటి కమీషనర్ ఆఫ్ పోలీస్ (అడ్మిన్) టి.హరికృష్ణ చెప్పారు. రెడ్‌సర్కిల్‌లో ఉన్న బిషప్ హజరయ్య బాలికోన్నత పాఠశాల ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లి హరిత ఆధ్వర్యంలో గత విద్యాసంవత్సరం పదో తరగతిలో ఉత్తమ మార్కులతో ప్రతిభ చూపిన పది మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు, ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం స్కూల్ ఆవరణలో బుధవారం జరిగింది. డీ సీ పీ టీ.హరికృష్ణ ముఖ్యఅతిథిగా హజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ..విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లి హరిత అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ హైకోర్టు న్యాయవాది చలసాని అజయ్‌కుమార్ కుమారుడు చలసాని వెంకట్ పుట్టిన రోజు సందర్భంగా గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకార వేతనాలు, విద్యార్థులకు నోటు పుస్తకాలను తమ క్లబ్ ద్వారా అందచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. బిషప్ అజరయ్య హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఐఏ. జయశ్రీ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆర్థికంగా పేద వారే కాని ఆలోచనలు, సేవా గుణంలో మాత్రం చాలా ఉన్నతమైన వారిని అన్నారు. క్లబ్ కార్యదర్శి కోటా ఫణీంద్ర, క్లబ్ ఆర్గనైజర్ యోగా గురువు అంకాల సత్యనారాయణ, పోన్నాడ ఈశ్వరాచారి, ఎల్.రామకృష్ణ, పాల్గొన్నారు.

CHANGE OF NAME

GUDDETI JASHUVA DANIYELU (Old Name) S/O GUDDETI YESOBU R/O F.no:106, Nirmala Residency, Kamalam bazar, Murali Nagar, Vijayawada, Krishna Dt, 520007, A.P., INDIA. I Changed my name to GUDDETI JOSHUA DANIEL (New Name) Hence forth I will be known as **GUDDETI JOSHUA DANIEL**

4న ఇస్కఫ్ సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ: అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం, హిరోషిమా డే పురస్కరించుకుని ఆగస్టు నాల్గవ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు దాసరిభవనంలో శాంతి స్నేహ సంఘాలు, యువజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 'యుద్దాలు వద్దు - ప్రపంచ శాంతి ముద్దు' అంశం పై సదస్సు జరుగుతుందని ఇస్కఫ్ జిల్లా కార్యదర్శి మోతుకూరి అరుణకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఇటీవల సోషలిస్టు దేశం వియత్నాం పర్యటించి వచ్చిన ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్ - నిర్మల దంపతులు, అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్ బాబులు పాల్గొని అక్కడి విశేషాలు, అనుభవాలు వివరిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నోయిడా ఫ్యాక్టరీని సందర్శించిన శాంసంగ్ వీసీ, సీఈఓ జెహెచ్ హాన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ వైస్ ఛైర్మన్, సీఈఓ, డివైస్ ఎక్స్‌పీరియన్స్ (డీఎక్స్) హెడ్ జోంగ్-హీ హాన్ ప్రస్తుతం భారతదేశంలో ఈ సంవత్సరం తన పర్యటన రెండవ పర్యటనలో ఉన్నట్లు శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ కో. లిమిటెడ్ ప్రకటించింది. ఈ పర్యటన దక్షిణ కొరియా దిగ్గజ సంస్థ కోసం భారతదేశం యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను సూచిస్తుంది. శాంసంగ్ స్మార్ట్‌ఫోన్‌లు, టాబ్లెట్‌లు, రిఫ్రిజిరేటర్‌లను తయారు చేస్తోన్న కంపెనీ నోయిడా ఫ్యాక్టరీని సోమవారం హాన్ సందర్శించారు.

ప్రత్యేక కౌంటర్‌లో నిత్యావసరాలు ధరలు తగ్గించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రజలకు నిత్యావసరాలు అయిన కందిపప్పు, బియ్యం ధరలను మరోసారి తగ్గించి అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని దానికి వర్తకులు,రైస్‌మిల్లర్స్ అంగీకరించారని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వక్కలగడ్డ భాస్కరరావు తెలిపారు. బుధవారం ఏపీ సివిల్ సప్లయస్ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన వర్తక సమావేశంలో నిర్వహించారు.ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు,అన్ని జిల్లాల వర్తక ప్రతినిధులు,రాష్ట్రంలోని రైస్ మిల్, వర్తక ప్రతినిధులు హాజరై పలు విషయాలు చర్చించారు. రైతు బజార్లలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో కందిపప్పు కిలో రూ.160 నుంచి రూ.150కీ, బియ్యం రూ.48 నుంచి రూ.46కీ, స్టీమ్డ్ బియ్యం రూ.49 నుంచి రూ.47కీ తగ్గించడమైనది. రైతు బజార్లలో ఉన్న ప్రత్యేక కౌంటర్లలో గురువారం నుంచి తగ్గింపు ధరల్లో విక్రయిస్తారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్లకు మంత్రి ఆదేశించారన్నారు.రైస్ మిలర్స్‌ను ఒప్పించి అటు ప్రభుత్వానికి ప్రజలకు ఆమోదయోగ్యంగా చేయుట జరిగిందని ఆయన పేర్కొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : పీడీ

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ మండలం రాఘవాపురం గ్రామంలో పాఠశాలలో అంగనవాడి కేంద్రాలను బుధవారం ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారిణి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పిడి ఉమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు,అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాలలో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని,మురుగునీరు నిలువ ఉండకుండా పారుదల అయ్యేలా, గ్రామాల్లో చెత్తాచెదారం ఎరువు దిబ్బలు తొలగించాలని,గ్రామపంచాయతీ కార్యదర్శులు సిబ్బందికి తెలిపారు, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలను ప్రత్యేక అధికారిని ఉమాదేవి సందర్శించి మధ్యాహ్న భోజన పథకం పనితీరు విద్యార్థుల హాజరు శాతం,విద్యా బోధన పరిశీలించారు,ఈ కార్యక్రమంలో సిడిపిఓ భాగ్య రేణుక,సూపర్వైజర్ వెంకట రావమ్మ ,గ్రామ సర్పంచ్ పెసరమల్లి సురేష్,కార్యదర్శి రాంజీ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు ఆయాలు పాల్గొన్నారు.

రియల్ మీ 13 ప్రో సిరీస్ 5జీ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: స్మార్ట్‌ఫోన్ ఏఐఓటీ పోర్ట్ఫోలియో లో అత్యంత మెరుగైన ఉత్పత్తులను ప్రకటించినట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. అత్యంత మెరుగైన రియల్ మీ 13 ప్రో సిరీస్ 5 జి, రియా, మీ స్వచ్ఛ ఎస్ 2 మరియు రియల్ మీ బడ్స్ టి 310 అనేవి ప్రవేశ పెట్టబడినాయన్నారు. రియల్ మీ 13 ప్రో సిరీస్ 5 జి రెండు మోడల్స్ లో రియల్ మీ 13 ప్రో ం 5 జి మరియు రియల్ మీ 13 ప్రో 5 జి లో అందుబాటులో ఉంటుందన్నారు. దానిలో అల్ట్రా క్లియర్ కెమెరా తో పాటు ఏ ఐ ఉంటుంది. అది అత్యుత్తమమైన క్లౌడ్ మొనెట్ టెక్నాలజీ తో ప్రేరేపించబడినదన్నారు. రియల్ మీ 13 ప్రో ం 5 జి రెండు ఆకర్షణీయమైన రంగులలో అనగా మొనెట్ గోల్డ్ ఎమరాల్డ్ గ్రీన్ రంగులలో మూడు స్టోరేజ్ రకాలలో 8GB+256GB రూ.29,999కు, 12GB+256GB 31,999 రూపాయలకు మరియు 12GB+512GB 33,999 రూపాయలకు రియల్ మీ డాట్ కామ్, ఫ్లిప్కార్ట్ మరియు ఇతర ముఖ్య చేనల్స్ లో అందుబాటులో ఉంటుందన్నారు.

కంటి శుక్లాలు అంధత్వానికి ప్రధాన కారణం

విశాలాంధ్ర-విజయవాడ: అంధత్వానికి ప్రధాన కారణంగా కంటి శుక్లాలే నిలుస్తున్నాయని, కంటి శుక్లాల శస్త్ర చికిత్స నిపుణులైన నేత్ర వైద్యుని పర్యవేక్షణలోనే జరగాలని ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ ఉమా యోగేష్ తీగలే తెలిపారు. ఈ మేరకు విజయవాడలోని కోడే వెంకటాద్రి చౌదరి క్యాంపస్‌లోని ఎల్‌వీ ప్రసాద్‌ఐ ఇనిస్టిట్యూట్‌లో బుధవారం కంటి శుక్లాలు, చికిత్సలు, అందత్వం అనే అంశంపై జరిగిన వైద్య సదస్సు లో డాక్టర్ మాట్లాడుతూ శుక్లాలు ప్రధానంగా కంటిలో వయసు సంబంధిత మార్పుల వల్ల కలుగుతాయన్నారు. జన్యుపరమైన, జీవక్రియ లోపాలు, ఇన్ఫెక్షన్లు, గాయం కారణంగా శిశువులు, చిన్న పిల్లలలో కూడా కంటిశుక్లం సంభవించవచ్చునన్నారు. కనుబొమ్మల అసంకల్పిత వణుకు వంటివి కలిగి ఉండవచ్చు అన్నారు.

ప్రకటన

నా క్లయింటు విజయవాడ మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ, గుప్తా కళ్యాణ మండపం దగ్గర, ఫ్లాట్ నెం.74, బి-3, కొలిగ్స్ అపార్ట్‌మెంట్, విజయవాడ కాపురస్తురాలు పల్లెం కెనడి గారి భార్య శ్రీమతి పల్లెం శారద గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియ జేయునది ఏమనగా... ది.30-07-2024న ఉదయం గం.11.00ల సమయంలో తన ఇంటి వద్ద నుండి బయలు దేరి పటమట హైస్కూల్ రోడ్డులోని రైతు బజారు వద్దకు ఈ దిగువ తెలిపిన తన భర్త గారి పేరున గల రిజిస్టర్డ్ ఓరిజినల్ దస్తావేజు నెం. 11529/2024 ది.3-5-2024న ఎస్ఆర్ఓ, కంకిపాడులో రిజిస్టర్ కాబడిన ఒరిజనల్ దస్తావేజును ఫోటోస్టాట్ నిమిత్తం రైతు బజారు వద్దకు ఆటోలో వెళ్ళి తిరిగి కొంత దూరం నడిచి ఫోటో స్టాట్ వద్దకు వెళ్ళి చూసుకొనగా పై తెలిపిన ఒరిజనల్ దస్తావేజు నెం.11529/2024ను పోగొట్టుకొని యున్నారనియు, ఎంత వెదికిననూ దొరికి యుండలేదని తెలియజేయుచున్నారు. కావున సదరు దస్తావేజులు ఎవరికైననూ దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు గానీ, పై తెలిపిన నా క్లయింటు అడ్రస్‌కు గానీ అందజేసి తగిన పారితోషికం పొందగలరు. అట్లు గాక సదరు దస్తావేజును ఉపయోగించి ఏ విధమైన లావాదేవీలు జరిపిన యెడల అవి చెల్లనేరవని అట్టివారి పై చట్టపరమైన సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని తెలియజేయడమైనది.

పెదపూడి దామోదరరావు, న్యాయవాది
డోర్ నెం.18-135, మైత్రీనగర్, కానూరు గ్రామం
పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా.
సెల్: 98660 15916